సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రయోజనాలు సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబరుకు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

వామనుడిగా జగన్నాథుడు



వామనావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

భీమునిపట్నం: జగన్నాథుడు వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భీమిలిలో జరుగుతున్న జగన్నాథస్వామి రథోత్సవాల్లో దశావతారాల అలంకరణల్లో భాగంగా స్వామిని బుధవారం వామనుడిగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.సింగరాచార్యులు ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు ఈ అవతారం గురించి వివరించారు.

పారిశుధ్య పనుల పరిశీలన

పద్మనాభం: మండలంలోని కొత్త కొవ్వాడలో పారిశుధ్య పనులను ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో మీనా కుమారి బుధవారం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. రక్షిత మంచి నీటి పథకాలను క్లోరినేషన్ చేశారో లేదో పరిశీలించారు.

పొగ పెట్టారు



వేములవలస జాతీయ రహదారి వద్ద కాలుస్తున్న టైర్లు

తగరపువలస: కాలుష్యానికి దూరంగా ఉండే ఆనందపురం మండలం వేములవలసలో జాతీయరహదారిని ఆనుకుని బుధవారం పొగ పెట్టేశారు. టైర్లతో ఉండే ఇనుప తీగ కోసం రోడ్డు పక్కనే వాటిని తగలబెట్టారు. దీంతో దుర్గంధంతో కూడిన నల్లటిపొగ వాహనదారులతో పాటు కాలనీలో ఉన్న వారిని ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇలాంటి వారిపై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కొందరు కోరుతున్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సత్కారం



ఏసుదాసును సన్మానిస్తున్న తహసీల్దార్ ఆనందరావు, సిబ్బంది

పద్మనాభం: పద్మనాభం తహసీల్దార్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పని చేసి, పదవీ విరమణ పొందిన ఏసుదాసును ఘనంగా సత్కరించారు. కార్యాలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ కె.ఆనందరావు మాట్లాడుతూ ఏసుదాసు సేవలను కొనియాడారు. అనంతరం దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

కార్మికుల బకాయిల కోసం దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లులో యాజమాన్యం నుంచి రావలసిన బకాయిల కోసం కార్మికుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. మొదటి రోజు 85 మంది కార్మికులు దరఖాస్తు చేసుకున్నారు. పీఎఫ్, గ్రాట్యుటీ, నష్టపరిహారం, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మాయిన్ఫీడ్స్, వితంతువులకు పరిహారం, విద్యుత్ మీటర్ డిపాజిట్లపై ఈ నెల 20 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

పెరియాళ్వార్ తిరునక్షత్రం పూజలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం పెరియాళ్వార్ తిరునక్షత్రం పూజలు విశేషంగా జరిగాయి. ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను, పెరియాళ్వార్‌ను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం చేశారు.



స్వాతంత్ర్యనగర్ డిపో వద్ద క్యూలో నిల్చున్న వృద్ధులు

వృద్ధులకు ఇంటికి అందని సరకులు

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్ద రెండు రోజులు ముందే సరకులు అందించేస్తామని పాలకులు ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్నారు. కాని ఏ డిపో దగ్గరకి వెళ్లి చూసినా వృద్ధులు ఇతరులతో కలసి క్యూల్లో నిలబడాల్సిన దుస్థితి. వీరికి డిపోల వద్ద ప్రత్యేక క్యూ కూడా లేకపోవడంతో సరకులు తీసుకోవడానికి గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

రేషన్ సరకుల కోసం మళ్లీ పడిగాపులు

సరకులు తీసుకునేందుకు కిలోమీటర్ల నడక

ఎండీయూ వాహనాల నిలిపివేతతో లబ్ధిదారుల అవస్థలు

మధురవాడ: ఎండీయూ వాహనాల నిలిపివేతతో రేషన్‌కార్డు దారులకు మళ్లీ అవస్థలు మొదలయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ఇంటి సమీపంలోకే వచ్చే వాహనం వద్ద సరకులు తీసుకునే వెసులుబాటు ఉండడంతో కార్డుదారులకు దూరాభారం తప్పింది. ఇప్పుడు వాహనాల నిలిపివేతతో రేషన్ కష్టాలు మళ్లీ ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా మహిళలు రేషన్ సరకుల కోసం కిలోమీటర్లు నడిచి వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. కొందరు ఈ సరకుల కోసం ఒకటి, రెండు రోజులు పనులు మానుకోవడంతో పాటు ఆటోలకు కూడా అదనంగా డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

వార్డుల వారీగా కార్డుల వివరాలు

వార్డు	డిపోలు	కార్డులు
5	8	10478
6	9	12204
7	8	10064
8	5	6922
మొత్తం	30	39,668

కిలోమీటర్ల ప్రయాణం

- జీవీఎంసీ 6వ వార్డు పరిధి గిరిజన గ్రామం శంభువానిపాలెం లో సుమారు 80మంది కార్డుదారులు సుమారు 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న బక్కన్నపాలెం వెళ్లి సరకులు తీసుకోవాల్సి వస్తోంది.
- జీవీఎంసీ 5వ వార్డు బోయపాలెం సమీపంలో ఉన్న పీపీ–2 జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వాసులు (సుమారు 150 మంది కార్డుదారులు) సుమారు 2కిలోమీటర్ల దూరంలో ఉన్న పరదేశిపాలెం వెళ్లాలి.
- బోరవానిపాలెం, డ్రైవర్స్ కాలనీలకు చెందిన సుమారు 300మంది రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఐదే డిపోలో సరకులు తీసుకోవల్సిన పరిస్థితి.
- జీవీఎంసీ 7వ వార్డు ఐటీ సెజ్ జంక్షన్ వద్ద మానం ఆంజనేయులు కాలనీకి చెందిన సుమారు 200మంది 2కిలో మీటర్ల దూరంలో ఉన్న నగరంపాలెం డిపోకి వెళ్లి సరకులు తెచ్చుకోవాలి.
- హరిత గేటెడ్ కమ్యూనిటీ వాసులు 3కిలోమీటర్లు రేషన్ సరకుల కోసం వెళ్లాలి.



పాత పద్ధతే బాగుంది

రేషన్ డిపో వద్దకు వచ్చి సరకులు పట్టుకుని, మోసుకువెళ్లడం చాలా కష్టంగా ఉంది. గతంలో వీధిలోకి బండి వచ్చేది. ఇప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నాం. పాత పద్ధతే బాగుంది.

– కనక, మధురవాడ


ఇంటి దగ్గర ఇవ్వలేదు

లిస్టులో నా పేరు లేదని ఇంటికి తెచ్చి రేషన్ బియ్యం ఇవ్వలేదు. అందుకే డిపోకు వచ్చాను. నడవడానికి ఇబ్బంది. ఇంక బియ్యం మోసుకెళ్లడం ఎలాగో పాలుపోవడం లేదు. మా పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు అయ్యింది.



– నారాయణమ్మ, టైలర్స్ కాలనీ

మళ్లీ పాత అవస్థలే..



మానం ఆజనేయులు కాలనీ నగరంపాలెం రేషన్ డిపోకు 2కిలో మీటర్ల దూరంలో ఉంది. ఆటో ట్రాన్స్‌పోర్ట్ లేదు. సొంత వాహనాలు లేనివారు ప్రత్యేకంగా ఆటోలు కట్టించుకుని సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోంది. ఇలాంటి కాలనీలు చాలా ఉన్నాయి. ఈ కాలనీతో పాటు హరిత పరిసర ప్రాంతాల వారికి ప్రత్యేకంగా డిపో ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తప్పుతాయి.

– జీడీ నాయుడు, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు



మధురవాడ క్వారీ రేషన్ డిపో వద్ద క్యూలో నిలబడలేక కూర్చున్న మహిళలు



స్వతంత్రనగర్ డిపో వద్ద క్యూ

మాలాంటోళ్లను ఇబ్బంది పెడుతున్నారు



ఇంటి దగ్గరే కోటా బియ్యం ఇస్తామన్నారు. కానీ, మాకు ఇవ్వలేదు. మధ్యాహ్నం కోటాకి వ చ్చాను, ఇప్పుడు దాకా పో లేదు. వరుసలో నిలబడ్డాను. కూర్చుంటే నిలబడలేం.. నిలబడితే కూర్చోలేం. నాలాంటోళ్లకి ఇంటికి ఇవ్వాలి కదా? బియ్యం లేకపోతే రోజు గడవదు కాబట్టి తప్పక నిలబడి ఉన్నాం.

– జి. లక్ష్మి, స్వతంత్రనగర్

ఉచిత అడ్మిషన్లు తిరస్కరిస్తే చర్యలు

- విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్
- విశాఖ రూరల్ మండలంలో పలు పాఠశాలల సందర్శన



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారులు



మారికవలస గ్రీన్‌డేల్ స్కూల్లో ఉచిత అడ్మిషన్ ఇప్పిస్తున్న ఆర్‌జేడీ విజయభాస్కర్

మధురవాడ: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఆర్‌టీఈ యాక్ట్ 12(1) సీ ప్రకారం పేదలకు 25శాతం ఉచిత సీట్లు ఇవ్వాల్సిందేనని విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్ స్పష్టం చేశారు. సరైన కారణాలు లేకుండా అడ్మిషన్లు తిరస్కరిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ ఆదేశాలు పాటించని ప్రైవేటు యాజమాన్య పాఠశాలలను గుర్తించి, శాశ్వతంగా మూసివేసేట సిఫార్సు కూడా చేస్తామని హెచ్చరించారు. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వం కేటాయించిన సీట్లలో పేద విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకోవడం లేదని వస్తున్న ఫిర్యాదుల మేరకు బుధవారం జిల్లా స్థాయి అధికారులతో కలసి ఆయన విశాఖ రూరల్ మండలంలోని మధురవాడ, మారికవలస, ఎండాడ తదితర ప్రాంతాల్లోని పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్న సిల్వర్ ఓక్స్, మారికవలస పోలక్స్ ఇంటర్నే, గ్రీన్ డేల్ తదితర పాఠశాలలను సందర్శించి ఆయా యాజమాన్యాలతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం విద్యార్థులను చేర్పించాలని, ఆన్‌లైన్‌లో సీటు వచ్చినట్లు నిర్ధారణ అయితే, ఎట్టి పరిస్థితుల్లో వారిని వెనక్కి పంపించకూడదని స్పష్టం చేశారు. ఈ బృందంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ చంద్రశేఖర్, విశాఖ రూరల్ ఎంఈవోలు రవీంద్రబాబు, అనూరాధ, ఎన్‌ఎస్ఎస్ స్కోలెజ్ ఆఫీసర్ అప్పల నాయుడు, దేవుడు బాబు, ఎంఎల్ఎస్ఓ శ్రీనివాస్, అసిస్టెంట్ ఏఎంఓ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బోయిపాలెంలో 'భూ'చోళ్లు..!

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ బోయిపాలెంలో వీఎంఆర్డీఏ కొత్తగా ప్రతిపాదించిన 60 అడుగుల రోడ్డు చుట్టూ కొత్తగా 'భూ'చోళ్లు బయలుదేరారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రతిపాదిత రోడ్డు కోసం ఐదేళ్ల కిందట మండల అధికారుల సమన్వయంతో వీఎంఆర్డీఏ అధికారులు గంభీరం గ్రామ సచివాలయం వద్ద రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ రోడ్డు వలన గ్రామానికి, రైతులకు ఒనగూరే లాభాల గురించి తెలియజేశారు. రైతులు ఇచ్చిన భూములకు గాను 1:4కు సమానంగా టీడీఆర్లు ఇవ్వనున్నట్లు వివరించారు. దీనిపై ముందుగా తేరుకున్న కొందరు భూచోళ్లు ప్రతిపాదిత రోడ్డు మ్యాప్‌ను పట్టుకుని రంగంలోకి దిగిపోయారు. ఏయే సర్వే నంబర్లలో రోడ్డు వస్తుంది? ఆ నంబర్లలో ఉన్న రైతులు ఎవరు? వారు ఎక్కడ ఉన్నారు? వారికి ఆ భూములపై ఉన్న హక్కులు ఏమిటని విచారిస్తున్నారు. వలస పోయిన రైతులు, ఆచూకీ లేని పట్టాదారులు, అనుభవంలో ఉన్న పట్టాదారులను టార్గెట్ చేస్తున్నారు. మండలశాఖ అధికారులు, రాజకీయ నాయకుల సహకారంతో కబ్జాలకు పాల్పడుతున్నారు. ఇందులో పలువోట్ల ప్రభుత్వ భూములు కూడా ఉన్నాయి. గంభీరం పంచాయతీపై కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించి ప్రభుత్వ ఆస్తులు, అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ వాసులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ పూర్వ వైభవానికి కృషి



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు

పీఎం పాలెం: వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు సమిష్టిగా కృషి చేయాలని జీవీఎంసీ ఏడో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు కోరారు. పాత పీఎం పాలెంలోని ఆయన స్వగృహంలో వార్డు నాయకులతో బుధవారం నిర్వహించిన కమిటీల ఏర్పాటు సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో, జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమ ఫలాలు అందుకున్న రాష్ట్ర ప్రజలు, ప్రస్తుత కూటమి పాలనలో తాము ఎంతగా వంచనకు గురైంది ఇప్పటికే గుర్తించారన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడంలో వారికి సహకరించాలన్నారు. పేదలకు అండగా నిలవాలని కోరారు. భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త చిన్న శ్రీను నాయకత్వంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పిళ్లా నూకిబాబు, సీహెచ్ రజని, పీవీజీ అప్పారావు, కురిటి రామారావు, టి.వరలక్ష్మి, పి.ఎల్లాజీ, వెంకటేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ తాళ్లవలస హైస్కూల్ ఉపాధ్యాయులకు సన్మానం

'పది'లో విద్యార్థుల శతశాతం ఉత్తీర్ణతపై ప్రశంసల జల్లు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ రామస్వామి నాయుడు

పద్మనాభం: మండలంలోని బీఆర్ తాళ్లవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు ముగ్గురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు రావడంతో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను ప్రశంసించారు. ప్రధానోపాధ్యాయులు బండారు అప్పలరాజు, ఉపాధ్యాయులను భీమునిపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కురిమిన రామస్వామి నాయుడు దుశ్శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు కిలారి రమణ పాల్గొన్నారు.

రెండు బెల్టు షాపులపై దాడి

పద్మనాభం: మండలంలోని రెండు గ్రామాల్లో బెల్టు షాపులపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ షాపుల నిర్వాహకుల నుంచి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని మద్ది పంచాయతీ తునిపాలెంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న కళ్ల రాంబాబు నుంచి ఆరు, నేరెళ్లవలస పంచాయతీ విజయానందపురంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న బంగారు లక్ష్మణ్ నుంచి ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ జె.సురేష్ తన సిబ్బందితో ఈ దాడి చేశారు. రాంబాబు, లక్ష్మణ్‌పై కేసు నమోదు చేశారు.

నాటక పోటీలకు విద్యార్థులకు ఆహ్వానం



డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విష్ణుమూర్తికి ఆహ్వాన పత్రం అందిస్తున్న కళాసాహితి సభ్యులు

భీమునిపట్నం: భీమిలిలోని కళాసాహితి సంస్థ నిర్వహించనున్న నాటక పోటీలకు విద్యార్థులను ఆహ్వానిస్తున్నారు. ఇందులో భాగంగా సంస్థ అధ్యక్షుడు పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఏపీ బాలికల గురుకుల పాఠశాల, మహిళా పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులను బుధవారం కలిసి ఆహ్వాన పత్రాలను అందించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ వర్మ మాట్లాడుతూ విద్యార్థుల్లో నాటక కళలపై ఆసక్తి పెంపొందించడానికి ఈ నాటక పోటీలను నిర్వహించడానికి నిర్ణయించామన్నారు. పర్యావరణం, మాదక ద్రవ్యాలు, సామాజిక మాధ్యమాలు, సైబర్ నేరాలు, నైతిక విలువలు అనే అంశాలపై నాటకాలు ప్రదర్శించవలసి ఉంటుందని తెలిపారు. ఇందులో జూనియర్, సీనియర్ విభాగాలు ఉంటాయని, ఎవరు ఏ నాటకాన్ని ప్రదర్శిస్తారో ఆ వివరాలను తమకు అందించాలని సూచించారు. ఆగస్ట్ 9, 10 తేదీల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు అల్పాహారం, భోజన వసతులు, విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలియజేశారు. సంస్థ సభ్యులు కళ్ల సన్నీ, ఆదిరం కోర్, కె.మువ్వలరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో నాలుగు పాడి ఆవులు మృతి





ప్రమాదంలో మృతి చెందిన ఆవు, గాయపడిన ఆవు

పద్మనాభం: మండలంలోని మద్ది పంచాయతీ రామకోటి ఆశ్రమం లక్ష్మినాయుడు కళ్లాల్లో బుధవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో నాలుగు పాడి ఆవులు పూర్తిగా కాలిపోయి, మృతి చెందాయి. కె.బంగారునాయుడు, కె.పైడినాయుడులకు చెందిన మూడు పూరిపాకలు తగలబడిన సంఘటనలో అందులో ఉన్న పాడి ఆవులు మంటల్లో కాలిపోయాయి. సకాలంలో స్పందించిన స్థానికులు మిగిలిన ఆవులకు ప్రమాదం జరగకుండా తప్పించారు. ప్రమాదానికి కారణాలు తెలియవలసి ఉంది. పద్మనాభం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై విచారిస్తున్నారు.

చినుకు పడితే అడుగు వేయలేం..

అధ్వానంగా దాకమర్రి రహదారులు





దాకమర్రి పంచాయతీలో చిత్తడిగా సీసీ రోడ్డు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి పంచాయతీలో సీసీ రోడ్డు చిత్తడిగా మారిపోయాయి. పంచాయతీలో ఏ మూల చూసినా అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి కనిపిస్తుంది. దీనికి తోడు స్థానికులు తమ పాడి పశువులను రోడ్లపై కట్టేయడంతో వాటి మూత్రం, పేడలతో కంపు కొడుతున్నాయి. పంచాయతీ కార్యదర్శి సక్రమంగా విధులకు హాజరు కాకపోవడంతో పారిశుధ్య సమస్యలపై ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని పంచాయతీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలోనే కాకుండా సాధారణ సమయంలోనూ దాకమర్రి పంచాయతీ రహదారులు దుర్గంధభరితంగానే ఉంటాయని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీలో రహదారులు, డ్రైనేజీలు శుభ్రం చేసి, పశువులను రోడ్లపై కట్టకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకురాలికి నివాళులు

తగరపువలస: ఇటీవల అస్వస్థతకు గురై మరణించిన జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు నాయకురాలు సీతక్కకు వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం నివాళులు అర్పించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, జీరు వెంకటరెడ్డి, ఉప్పాడ నాగేశ్వరరావు, పందిరి విజయ్, చింతగుంట శివ, తమ్మిన నరసింగరావు, సోమి అప్పలరాజు, కుమిలి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


టీడీఆర్ సమస్య పరిష్కారానికి వినతి



ఎమ్మెల్యే గంటాకు వినతిపత్రం ఇస్తున్న గ్రామ పెద్దలు

మధురవాడ: ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండిపోయిన 6వ వార్డు రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ బాధితుల టీడీఆర్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పెద్దలు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. 80అడుగుల రోడ్డు విస్తరణలో కోల్పోయిన ఇళ్లకు 1:4కు ఆర్‌సీసీ బిల్డింగ్ ఉన్న వారికి బిల్డింగ్ కాంపెన్సేషన్ ఇస్తామని అధికారులు చెప్పారు. బిల్డింగ్ కాంపెన్సేషన్ ఇవ్వని టీడీఆర్ మాత్రం ఇవ్వలేదన్నారు. జీవీఎంసీ గిఫ్ట్‌డీడ్ రిజిస్ట్రేషన్ చేసే నెల రోజుల్లో టీడీఆర్ ఇస్తామని అధికారులు చెప్పడంతో గత మార్చిలో అధికారులు సూచించిన ప్రకారం 24మంది రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశామని, మిగిలిన 8మందికి ఎండార్స్‌మెంట్ ఇవ్వని కారణంగా రిజిస్ట్రేషన్ పూర్తి కాలేదని చెప్పారు. ఇప్పటికీ ఏ ఒక్కరికి టీడీఆర్ ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని గ్రామ పెద్దలు ఎస్.వెంకటరావు, వాండ్రాసి సూరిఅప్పారావు, పిళ్లా రమణబాబు, లక్ష్మణరావు, రాజు తదితరులు తెలిపారు.

సుపరిపాలనలో తొలి అడుగు... తిరుగుబాటు ఇక్కడే మొదలు



పెద్దిపాలెం సుపరిపాలనలో తొలి అడుగు నియోజకవర్గ సమావేశంలో వేదిక వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న 2వ వార్డు నాయకులు

తగరపువలస: కూటమి ప్రభుత్వం 'సుపరిపాలనలో తొలి అడుగు'ను అంటూ భీమిలి నియోజకవర్గంలో నెల రోజుల కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి సమావేశం లోనే భీమిలి జోన్ 2వ వార్డు నాయకులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి నాయకత్వంపై తిరుగుబాటు చేశారు. వివరాలివి. ఆనందపురం మండలం పెద్దిపాలెం చెన్నా కన్వెన్షన్ హాలులో బుధవారం జరిగిన భీమిలి నియోజకవర్గ సమావేశానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నెలరోజుల పాటు జరిగే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఏడాదిపాటు కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వార్డు, మండల అధ్యక్షులను వేదికపైకి పిలవగా, జీవీఎంసీ రెండో వార్డు నుంచి చిల్లపిటకు చెందిన జీరు సత్యాన్ని వార్డు అధ్యక్షుడిగా వేదికపైకి రావాలని పిలవడంతో వివాదం రాజుకుంది. సత్యాన్ని ఎప్పుడు వార్డు అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని ప్రశ్నిస్తూ, తాము కూడా అధ్యక్ష పదవిని ఆశిస్తున్నామని రిక్క సత్య, బడిగంట మహేష్, బోడిపల్లి జయ సాయి శంకర్, గణేష్, పూల రవి వంటి నాయకులు తమ అనుచరులతో అరగంట పాటు ఆందోళన చేపట్టారు. ఈ ఊహించని పరిణామంతో నియోజకవర్గ నాయకులు అయోమయానికి గురయ్యారు. రవితేజతో పాటు గంటా అనుచరులు వారిని బుజ్జగించే ప్రయత్నం చేసినప్పటికీ వారి ఆగ్రహం చల్లారలేదు. తాము ఎమ్మెల్యే గంటా వద్దే తేల్చుకుంటామని చెప్పి సమావేశాన్ని బహిష్కరించారు. అనంతరం బయటకు వచ్చిన నాయకులు, ఏళ్ల తరబడి పార్టీకి సేవలందిస్తున్న తమను తీవ్రంగా అవమానించిన, తమకు తెలియకుండా సత్యాన్ని అధ్యక్షుడిగా ప్రకటించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఈ పరిణామం కూటమి ప్రభుత్వానికి, ముఖ్యంగా భీమిలి నియోజకవర్గ నాయకత్వానికి షాక్‌కు గురిచేసింది. మొత్తానికి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో అంతర్గత కలహాలు బయటపడ్డాయి.